‘పల్లె పండుగ’ నెరవేరేనా!

- మూడు నెలలుగా బిల్లులు బకాయిలు
- లబోదిబోమంటున్న కూటమి నేతలు
- వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆవేదన
- క్షేత్రస్థాయిలో పనులు మందగమనం


ఉపాధి నిధులతో నిర్మించిన గోకులం షెడ్డు

కాశినాయన : పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చడంలో టీడీపీది విభిన్న శైలి. అధికారంలో ఉన్నన్నాళ్లు తమ వారికి అన్నివిధాలుగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు రూపొందిస్తారు. ఇందులో భాగంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పనులు వారికే అప్పచెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో తమ వారికి సీసీ రోడ్ల పనులు అప్పగించారు. ప్రభుత్వం తమదే కాబట్టి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయని అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. అయితే పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి ఎంతో కొంత వెనకేసుకోవచ్చని కూటమి నేతలు భావించారు. పనులు చేసి మూడు నెలలు పూర్తవుతున్నా ఒక రూపాయి కూడా బిల్లులు మంజూరు కాలేదు. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ కార్యకర్తలకు ఆదాయం తెచ్చే మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇసుక, మట్టి తరలిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించాలని అధికారులను లోలోపల ఆదేశించినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా పల్లెపండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రోడ్ల పనులు నాయకులకు అప్పగించారు. వీటి ద్వారా వారికి మేలు చేయాలని భావించారు. మండల వ్యాప్తంగా 28 పనులకు గాను రూ.1.75 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించారు. అలాగే గోకులం పేరుతో పశువులు జీవాల షెడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రతి గ్రామంలో తమ కార్యకర్తలకే పనులు అప్పచెప్పేలా చర్యలు తీసుకున్నారు. పనులు దక్కించుకున్న కార్యకర్తలు, నాయకులు ప్రతి గ్రామంలో వారికి అనుకూలమైన వారికే గోకులం షెడ్లు, జీవాల షెడ్లు ఇచ్చారు. వారు త్వరితగతిన పనులు పూర్తి చేసి బిల్లులు మంజూరు చేయించుకుని ఎంతో కొంత ఆదాయం పొందవచ్చని భావించారు. కొంత మంది తమ వద్ద పెట్టుబడికి డబ్బులు లేకపోయినా అప్పు తెచ్చి పనులు పూర్తి చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలల్లోనే చేసిన పనులకు బిల్లులు చెల్లింపులో ఇంత జాప్యం చేస్తే భవిష్యత్తులో పనులు ఎలా చేయగలమని కొంత మంది నాయకులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల చెల్లింపులోనే ఇంత ఆలస్యం చేయడం ఎంత వరకు సమంజసమని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

పల్లెపండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి. బిల్లులు కూడా చేసి పంపించాము. ఈ నెల చివరి నాటికి బిల్లులు వస్తాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఎక్కడైనా పనులు మిగిలి ఉంటే పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. వాటిని కూడా త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–పుల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ, కాశినాయన మండలం

కేసీకి నీరు ఇవ్వకుంటే రైతులకు తీవ్ర నష్టం

ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య


మాట్లాడుతున్న ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య

చాపాడు: కేసీ కాలువకు ఏప్రిల్ 15వ తేది వరకూ సాగునీరు ఇవ్వాలని, లేకుంటే రెండో కారులో పంటలు సాగు చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతారని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఎంపీపీ లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ పంటల అనంతరం కేసీ కెనాల్ సాగునీరు ఇవ్వటంపై అధికారులు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో నీరు వస్తుందన్న కారణంతో రైతులు కేసీ ఆయకట్టులో రెండు కారు క్రింద వివిధ రకాలైన పంటలు సాగు చేశారన్నారు. వీటిని కాపాడుకోవాలంటే ఏప్రిల్ 15వ తేది వరకూ కేసీ కెనాల్‌కు సాగునీటిని కొనసాగించాలన్నారు. వేసవిలో మండల వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చియ్యపాడులో తాగునీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉండడంతో ముందుస్తు చర్యలు తీసుకునేందుకు అధికారులకు నివేదికలు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. రబీ సీజన్‌లో సాగైన వరి, మినుము ఇతర పంటలు దెబ్బతిన్నాయని, దీనిపై అధికారులకు నివేదిక అందించామని ఏఓ మ్యాగీ తెలిపారు. అయ్యవారిపల్లెలో స్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని ఎంపీటీసీ రమాదేవి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ వీర కిషోర్, ఈఓ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఎంఈఓ రవిశంకర్, ఏపీఎం శ్రీధర్, పశు వైద్యాధికారి సుదర్శన్‌రెడ్డి, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేటితరం నాయకులకు వెంకటసుబ్బయ్య ఆదర్శం


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : వైద్యునిగా, శాసనసభ్యుడిగా నిరాడంబర జీవితాన్ని గడిపిన దివంగత ఎమ్మెల్యే డాక్టర్ జీ.వెంకటసుబ్బయ్య నేటితరం నాయకులకు ఆదర్శమని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డి పేర్కొన్నారు. దివంగత నేత డాక్టర్ జీ.వెంకటసుబ్బయ్య చతుర్థ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన డాక్టర్ వెంకటసుబ్బయ్య వైద్యునిగా, శాసనసభ్యుడిగా రాణించడంలో ఎంతో కృషి దాగి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే అన్న అహంకారం ఎప్పుడూ చూపకుండా సామాన్య కార్యకర్తను కూడా ఆప్యాయంగా పలుకరించే గొప్ప మనసున్న వ్యక్తి డాక్టర్ జీ.వెంకటసుబ్బయ్య అని కొనియాడారు. అలాగే బద్వేలులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. తొలుత వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ బూత్‌కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పుత్తాశ్రీరాములు, రమేష్‌బాబు, కేశవరెడ్డి, అట్లూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, బిజ్జం రమణ, అనిల్, మౌలాలి, షఫి, సాంబశివారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజ్ఞాశాలి పుట్టపర్తి నారాయణాచార్యులు


పుట్టపర్తి నారాయణాచార్యులు విగ్రహానికి పూలమాల వేస్తున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలుగు భాషకు, తెలుగు కవిత్వానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఘనత పుట్టపర్తి నారాయణాచార్యులకు దక్కుతుందని, ఆయన 14 భాషల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి అని పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం కొనియాడారు. మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని ఆయన విగ్రహానికి జింకా సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి బాల్యంలోనే భారత, భాగవత గ్రంథాలను అవపోసన బట్టారన్నారు. ఆయన 14 భాషల్లో పాండిత్యం కలిగిన గొప్ప మహనీయుడని, శివతాండవం కావ్యంతోపాటు 150 గ్రంథాలు రాశారని ప్రశంసించారు. వేద పాఠశాల అధ్యాపకుడు వెంకటేశ్వరశర్మ, మహేష్, ఉదయ్, పుట్టపర్తి సాహితీ పీఠం సహాయ కార్యదర్శి కొత్తపల్లి శీను, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటు


ర్యాలీ నిర్వహిస్తున్న ఫాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

బద్వేలు అర్బన్ : పేదలను, అనాథలను చేరదీసే గొప్ప మనస్తత్వం ఉన్న ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని ఫాస్టర్స్ అసోయేషన్ అధ్యక్షుడు దేగల శ్యామ్యూల్, క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మునగల మోజేస్ అన్నారు. అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి ఆయన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఫాస్టర్స్ అసోసియేషన్, క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవ సమాజంలో ఎంతో పేరుపొందిన ప్రవీణ్‌పగడాల మరణం పలు అనుమానాలకు దారి తీస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపి క్రైస్తవ సమాజాన్ని కాపాడాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఫాస్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ మునిరాజు, ఉపాధ్యక్షుడు వీరదాసరి భాస్కర్, వై.కుమార్, ఎడ్వర్డ్,అగస్టీన్‌బాబు, బెతెస్త, ఎలీషా, యేసుదాసు, క్లైమెంట్, రవిచంద్రబాబు, శ్యామ్యూల్, అన్వర్‌బాషా, ఓ.ఎస్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

వంకపోరంబోకు భూమి పరిశీలన

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో 12 ఎకరాల వంకపోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని ఆర్డీఓ చంద్రమోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు తహసీల్దారు వెంకటసుబ్బయ్య శుక్రవారం వంకపోరంబోకు భూమిని పరిశీలించారు. ఆక్రమణకు గురైన భూమికి హద్దులు ఏర్పాటు చేసి జెండాలను పాతించారు. జెండాలను ఎవరైనా తొలగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. సర్వేయర్ నవదీప్, వీఆర్ఓ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

చాపాడు: మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీకని సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకుని శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అడ్మిన్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ద్వారా హిందు, ముస్లిం విద్యార్థుల మధ్య స్నేహ భావం, సోదరభావం పెంపొందుతుందని తెలిపారు. సంక్రాంతి, ఉగాది ఉత్సవాలను విద్యార్థుల మధ్య నిర్వహిస్తామని, ఇదే క్రమంలో వారి మధ్య స్నేహ, సోదర భావం పెంపొందించేలా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు కూడా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులందరికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని బ్రైట్ మైండ్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్టతను గొప్పతనాన్ని, ఉగాది పచ్చళ్లు, వంటకాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించండి

మైదుకూరు : ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు అన్నారు. శుక్రవారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పార్వతినగర్‌లో ఫ్రై డే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమల వల్ల అనేక జబ్బులు వస్తాయన్నారు. అందువల్ల దోమలను నివారించేందుకు ప్రతి శుక్రవారం నీటి తొట్లను క్లీన్ చేసి ఎండ పెట్టాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే జబ్బులు ముందు జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. సీనియర్ ఏపీడమాలజిస్ట్ ఖాజామొహిద్దీన్, మెడికల్ ఆఫీసర్ ఆయేషా, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రాచమల్లుకు వైఎస్సార్‌సీపీ నేతల సంఘీభావం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా టీడీపీ నేతలు చేసిన అక్రమాలు, దౌర్జన్యాల గురించి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇంటికి వచ్చారు. గత రెండు రోజులుగా జరిగిన సంఘటనల గురించి ఆరా తీశారు. కేవలం ఉపసర్పంచ్ పదవి కోసం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చేసిన అరాచకాలను రాచమల్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ముత్యాల రామగోవిందరెడ్డి, బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేలు డాక్టర్ సుధ, ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సాయిశ్రీ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ ద్వారా లక్ష్యాన్ని సాధించగలమని తెలిపారు. ఇంటర్నెట్‌లో, సోషల్ మీడియాలో మనకు ఉపయోగపడే విషయాలను నేర్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ గంగయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకుని ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి, విద్యలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు వీరకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, రాజేశ్వరి బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ బాలిరెడ్డి, సాయిరాజేశ్వరి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రామానుజమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంబెడెడ్ టెక్నాలజీపై వర్క్‌షాప్


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు

ప్రొద్దుటూరు : స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో 3వ, 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బెంగళూరుకు చెందిన రాడార్ టెక్నికల్ సెంటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ డొమైన్స్‌పై రెండు రోజులు వర్క్‌షాప్ నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాడార్ టెక్నికల్ సెంటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సురేష్ మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్ డొమైన్ ప్రాముఖ్యతను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించారు. ప్రతి రంగంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ టెక్నాలజీని వాడుతున్నారని తెలిపారు. రోబోటిక్స్, స్మార్ట్ ఫోన్స్ తయారీలో, వైద్య, డిఫెన్స్, ఆర్మీ, వ్యవసాయం తదితర రంగాల్లో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారన్నారు. ఎంబెడెడ్ సిస్టమ్స్ టెక్నాలజీని రెండు నెలల్లో సులభంగా ఎలా నేర్చుకోవాలో, ఇంటర్వ్యూలు ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. అనంతరం విద్యార్థులకు వర్క్‌షాప్ సర్టిఫికెట్లు అందించారు. హెచ్‌ఓడీలు ఎస్ఎంకే సుకుమార్‌రెడ్డి, పీఎం నాసిర్ హుస్సేన్, కె.రామ్మోహన్‌రెడ్డి, వి.నరసింహాస్వామి, ఎంవీవీ ప్రసాద్, ఏఓఎం రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీకే శాంత, నాగమల్లేశ్వరరెడ్డి, అంజి దంపతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధీ రోడ్డులోని సీఎస్ఆర్ హాస్పిటల్ దగ్గర బ్రహ్మకుమారీలు ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం బీకే శాంత, కాసిన నాగమల్లేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీకే శాంత మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవతానికి మూలాధారం మంచి నీరే అన్నారు. రోజుకు 750 లీటర్ల నీరు చొప్పున 80 రోజుల పాటు చలివేంద్రానికి కావాల్సిన మినరల్ వాటర్‌ను కాసిన నర్సిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కె.నాగమల్లేశ్వరరెడ్డి ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు వివరించారు. వారంలో రెండు రోజులు మజ్జిగా పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

పోరుమామిళ్ల: పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పట్టణానికి వివిధ పనుల కోసం గ్రామాల నుంచి వస్తున్న ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామానుజమ్మ శుక్రవారం తెలిపారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ డీఎంఎక్స్ టెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు వివిధ రకాలపై ఆప్టిట్యూడ్, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూలను విద్యార్థినులకు నిర్వహించారు. సీఎస్‌సీ విభాగంలో ప్రవీణ, స్నేహలత, రచన, అయేషా, ఈసీఈ విభాగంలో దివ్య ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షిక ఆదాయం రూ.3.5లక్షలు ఇవ్వనున్నట్లు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేంద్ర పేర్కొన్నారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అభినందించారు.

కార్యదర్శి ఇంటిపై దాడి హేయమైన చర్య


అట్లూరు: నిరసన తెలుపుతున్న కార్యదర్శులు



చాపాడులో..


రాజుపాలెంలో..

అట్లూరు : వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం వీరపునాయునిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపైన సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేయించే విషయంలో సహకరించలేదని దుండగులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌బాబు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ భాస్కర్‌బాబుకు వినతిపత్రం సమర్పించి అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధంగా భౌతికదాడికి దిగడం ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడే వారిని ఉపేక్షించకూడదని, ఇలాంటి దాడులు పునరావృతం కారాదని, ఉద్యోగులకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆనంద్‌రావు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు: వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషన్‌రెడ్డి ఇంటిపై దుండగులు దాడి చేయడం పట్ల శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ మేరకూ చాపాడులోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శి ఇంటిపై జరిగిన దాడి ఘటనపై దానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ వీర కిషోర్‌కు పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు.

రాజుపాళెం : వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి ఇంటిపై దుండగులు దాడి హేయమైన చర్య అని రాజుపాళెం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. శుక్రవారం రాజుపాళెం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయించే విషయంలో కార్యదర్శి సహకరించలేదని కొందరు దుండగులు కార్యదర్శి ఇంటిపై భౌతిక దాడికి దిగడం తగదని అన్నారు. ఈ విధంగా భౌతిక దాడికి దిగితే ఆందోళనలను ఉధృతం చేస్తామని, ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా కార్యాలయంలోనే పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ రమణారెడ్డికి పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస శివ రాత్రి పర్వదిన సందర్భంగా అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూమిపూజకు ఆహ్వానం


ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

పోరుమామిళ్ల: మండలంలోని సీతారాంపురం రోడ్డులో బండి నరవ వద్ద ఆలయాల సముదాయం,, 108 శివలింగాలు ఏర్పాటు చేసేందుకు నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు ఫణిరావు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కల్లూరు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

104 వాహనం తనిఖీ


104 వాహనం వద్ద డాక్టర్ బాలఆంజనేయులు

బి.కోడూరు : బి.కోడూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాయలకుంట్ల విలేజ్ హెల్త్ క్లినిక్ దగ్గర ఉన్న 104 వాహనాన్ని శుక్రవారం ఎస్.టి.ఆర్ వైద్యసేవ కడప జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బాలఆంజనేయులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంత మంది రోగులు వస్తున్నారు, మందులు ఏవైనా తక్కువ ఉన్నాయా, వాహనంలో ఏసీ పనిచేస్తుందా లేదా, ఓపీ రిజిస్టర్, ఈసీజీ పనిచేస్తుందా లేదా అని ఆరా తీశారు. అనంతరం 104 వాహన లాగ్‌రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఏఎన్ఎం లక్ష్మి, డీఈఓ నాగేశ్వర్‌రెడ్డి, వాహన పైలెట్ రాజేష్ పాల్గొన్నారు.

జగన్ వైపే జన బలం

చాపాడు: మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఎన్ని దౌర్జన్యాలు, కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ ప్రజామోదం వైఎస్సార్‌సీపీ వైపే ఉందని, ప్రజాబలం మాజీ సీఎం వైఎస్ జగన్ వైపే ఉందని ఆ పార్టీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఈయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికల్లో 20వార్డులు ఉంటే అందులో 14 మంది వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ వైపే నిలబడ్డారని, టీడీపీ బలం లేనప్పటికీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వర్గీయులు వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లు వెళుతున్న వాహనాలపై రాళ్లతో దాడి చేసి ఎన్నికలను వాయిదా వేయించడం పోలీసుల వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. దౌర్జన్యానికి పాల్పడ్డవారిని అరెస్ట్ చేయకుండా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు.

మెడికల్ కిట్లు పంపిణీ


ఉపాధి సిబ్బందికి మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వీర కిషోర్

చాపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తే సిబ్బందికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వీరకిషోర్ ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి పనులు జరిగే చోట కూలీల ఆరోగ్య సంరక్షణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టింక్చర్, దూది, బ్యాండేజీలతో కూడిన కిట్‌లను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు అందజేశారు. పని చేసే వద్ద కూలీలు వడ దెబ్బకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిత్యం ప్రాథమిక చికిత్స కొరకూ కిట్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సూచించారు.